




సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

సోమవారం 11-8-2025

సంపుటి: 21 సంచిక: 119
పేజీలు: 8 వెల: రూ.1






- తుదిరూపునకు కలెక్టరేట్
- ఉమ్మడి రాష్ట్రంలో పట్టాలెక్కిన ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్ట్
- మంత్రిగా ప్రసాదరావు ముందుచూపునకు సాక్ష్యం
- 2011లో మొదటి శంకుస్థాపన
- 2016లో చంద్రబాబు పేరిట శిలాఫలకం

## మూడు పార్టీలు.. నాలుగు ప్రభుత్వాలైనా

# దారి చూపింది ధర్మానే!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

**శిల శిల్పం కావాలంటే వందలాది ఉలి దెబ్బలు పడాల్సిందే. చివరిలో పడిన దెబ్బకే రాయి బద్దలయిందని భావిస్తే అంతకు మించిన తెలివితక్కువ తనం మరొకటి ఉండదు. అంతకు ముందు పడిన ప్రతీ దెబ్బ విలువైనదే.. అవసరమైనదే. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో సమీకృత కలెక్టరేట్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తిచేసుకొని కొద్ది రోజుల్లో ప్రారంభోత్సవానికి సిద్ధపడుతోంది. కూటమి ప్రభుత్వంలో దీని ప్రారంభోత్సవం జరుగుతున్నా, అసలు ఈ ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాన్సెప్ట్‌ను తెచ్చింది మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు.**

ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు రాష్ట్రంలో ఇటువంటి సమగ్ర కలెక్టరేట్‌లు ఆరుచోట్ల నిర్మించాలని భావించినా, ఒక్క శ్రీకాకుళానికి మాత్రమే నిధులు తెచ్చుకోగలిగారంటే అందుకు కారణం.. ధర్మాన ప్రసాదరావే. కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా గద్దెనెక్కిన తర్వాత రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా మారిన ధర్మాన ప్రసాదరావు శాఖకు అప్పటి వరకు జీరో బడ్జెట్ ఉంది. నిధులు లేని శాఖకు ధర్మానను మంత్రిని చేశారని విమర్శించినవారూ లేకపోలేదు. కానీ నిబద్ధత ఉంటే నిధులు ఆటోమేటిక్‌గా సమకూరుతాయని ధర్మాన ప్రసాదరావు నిరూపించారు. ఆరు ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్లలో ఒక్కటి మాత్రమే నిలిచిందంటే.. అందుకు కారణం ఆయన దూరదృష్టే. శ్రీకాకుళం నగరం నలుమూలల్లో సందుగొందుల్లో కూడా కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ఆర్ అండ్ బీ విధించిన రేట్ల మేరకు అద్దెలు ఉండటం వల్ల ప్రధాన మార్గాల్లో భవనాలేవీ ఇవ్వరు. అందుకే కొన్ని కార్యాలయాలు ఏ సందులో ఉన్నాయో కూడా చాలామందికి తెలియదు. అటువంటి కార్యాలయాలన్నింటినీ ఒకచోటకు తీసుకురావాలని ధర్మాన భావించారు. ఆ మేరకు అప్పటి ముఖ్యమంత్రిని ఒప్పించారు. జిల్లా నుంచి పెద్ద ఎత్తున ప్రభుత్వానికి రెవెన్యూ జనరేట్ చేసే రిజిస్ట్రేషన్, ఎక్సైజ్ శాఖలే అద్దె కొంపల్లో ఉన్నాయని ఉదహరించి నిధులు తెచ్చుకోగలిగారు. ఇప్పుడు దాని ఫలితమే పాత కలెక్టరేట్ ఆవరణలోనే కొత్త ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణం పూర్తిచేసుకుంది.

జిల్లా కేంద్రంలో సమీకృత కలెక్టరేట్ కాంప్లెక్స్ ఉండాలని 2011లో మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రతిపాదనతో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి 64 ప్రభుత్వ శాఖలు ఒకేచోట పని చేసేలా కలెక్టరేట్ కాంప్లెక్స్ నిర్మాణానికి 2011 జూన్ 8న శంకుస్థాపన చేశారు. 2011 నవంబర్‌లో నాగావళి నదికి అభిముఖంగా నూతన కలెక్టరేట్ నిర్మాణానికి పూణెకు చెందిన ఆర్కిటెక్ట్ సంస్థ ఇచ్చిన డిజైన్ ప్రకారం - మిగతా చివరి పేజీలో



2016లో చంద్రబాబు వేసిన శిలాఫలకం



2011లో కిరణ్‌కుమార్‌రెడ్డి వేసిన శిలాఫలకం

# ఎన్నికల సంఘం బీజేపీ పంజరంలో చిలకలా మారింది



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

- ప్రజాస్వామ్యానికి తీరని ద్రోహం.
- కేంద్రానికి భయపడుతున్న వైకాపా
- రాహుల్ గాంధీ విజ్ఞప్తిని సుప్రీం 'సుమోటోగా స్వీకరించాలి
- కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి


భారతదేశంలో ప్రజలు ఒకరికి ఓట్లేసి వేరొకరితో పరిపాలింపబడుతున్నారని, ప్రజలు ఈ విషయమై విస్తృతంగా చర్చిస్తున్నారని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు డాక్టర్ కిల్లి కృపారాణి ధ్వజమెత్తారు. ఈమేరకు సోమవారం టెక్కలిలో జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ భారత ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఇటీవల బెంగుళూరులో ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజంటేషన్"లో ఈ దిశగా ఆధారాలన్నీ చూపినా భారత ఎన్నికల సంఘం హేతుబద్దంగా స్పందించకుండా ప్రతిపక్షాలను బెదిరించే ధోరణిలో ప్రవరిస్తుందని ఆమె విమర్శించారు. రాహుల్‌గాంధీ 2024 ఎన్నికల్లో జరిగిన అవకతవకలపై అన్ని ఆధారాలు చూపించారని, 4.75 కోట్ల ఓట్లు తారుమారయ్యాయని, 79పార్లమెంటు స్థానాల్లో ఈ ప్రభావం పడిందన్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన ఇండియా కూటమి, నాలుగునెలల కాలంలో అనూహ్యమైన ఫలితాన్ని చవిచూడటం వెనుక కోటి జోట్లు గల్లంతు కుంభకోణం దాగుందన్నారు. అన్ని విధాలా నిరూపించినా ఎన్నికల సంఘం బీజేపీ పంజరంలో చిలకలా మాట్లాడుతుందన్నారు. కర్నాటక రాష్ట్రంలో మహాదేవపూర్ సెగ్మెంట్‌లో లక్షకు పైగా ఓట్లు ఎలా వచ్చాయని ఆమె ప్రశ్నించారు. ఒక ఇంటిపేరుతో వందలాది ఓట్లు, ఒకే వ్యక్తి పేరుతో దేశవ్యాప్తంగా వందలాది 'ఎపిక్' కార్డులు ఎలా పుట్టుకొస్తున్నాయో ఎన్నికల సంఘం చెప్పాల్సిన అవసరం లేదా అని ఆమె నిలదీశారు. భారత రాజ్యాంగంలో ఉన్న 324-329 అధికరణలు ఎన్నికల సంఘానికిచ్చిన అధికారులు నేడు దుర్వినియోగమవుతున్నాయన్నారు. బీహార్ రాష్ట్రంలో 326వ అధికారం దుర్వినియోగమవుతుందని, ఫలితంగా లక్షలాది ఓట్లను తొలగిస్తున్నారన్నారు. ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ కోరిన విధంగా డిజిటల్ ఓటర్ల జాబితాను అందజేయాలని, ఎన్నికల కమిష న్ ప్రతిష్ఠను దిగజార్చకుండా స్వతంత్రంగా, రాజ్యాంగబద్దంగా వ్యవహరించాలని ఆమె డిమాండ్ చేశారు.

### బీజేపీ అంటే వైకాపాకు ఎందుకంత భయం?

2024 సాధారణ ఎన్నికల్లో అవకతవకల ఫలితంగా ఈవీఎంల ట్యాంపరింగ్ ద్వారా ఆంధ్రరాష్ట్రంలో ఎన్నికల కౌంటింగ్‌లో సుమారు 53 లక్షల ఓట్లు అధికంగా వచ్చినా రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమైన వైకాపాకిమ్మనడం లేదని కృపారాణి వాపోయారు. ఈ దిశలో బలమైన ప్రజాస్వామ్యాన్ని నిర్మించి ఎన్నికల అవకతవకలపై పోరాడాల్సిన వైకాపా ఆ బాధ్యతనుండి తప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం వైకాపాతో సహా కమ్యూనిష్టు పార్టీలు, ప్రజాసంస్థలు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు రాహుల్ గాంధీతో కలసి రావాలని ఆమె కోరారు. సుప్రీంకోర్టు ఈ విషయంలో కల్పించుకొని ఎన్నికల సంఘం తీరుపై విచారణకు కేసును "సుమోటో"గా స్వీకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

### పీసీసీ పదవిపై కోరిక లేదు

మీడియా సమావేశంలో పాత్రికేయులు అడిగిన ఒకప్రశ్నకు సమాధానమిస్తూ తాను పీసీసీ అధ్యక్ష పదవిని కోరుకోవడం లేదన్నారు. తన ఢిల్లీ పర్యటన సందర్భంగా కేంద్రంలో రాహుల్, ఖర్గే, సోనియా, కె.సి. వేణుగోపాల్ వంటి నేతల్ని కలవడం వాస్తవమేనని, అయితే రాష్ట్రలో పార్టీ పటిష్టతపై మాత్రమే తాను వారితో మాట్లాడానన్నారు. పీసీసీ అధ్యక్ష పదవిపై వస్తున్న వార్తలు ఊహాజనితమేనన్నారు. ప్రస్తుత పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి రాష్ట్ర పరిధిలో పార్టీ పటిష్టపరిచే దిశగా కృషి చేస్తున్నారని, జిల్లా నూతన డీసీసీ అధ్యక్షుల నియామకం కోసం కూడా ఆమె కసరత్తు చేస్తున్నారని మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.




# ఎంపీ కలిశెట్టి భుజం తట్టిన ప్రధాని మోడీ

(సత్యంన్యూస్, న్యూఢిల్లీ)

పార్లమెంటుసభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడును సోమవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భుజం తట్టి, ప్రశంసించారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో టీడీపీ ఎంపీల బృందం పార్లమెంట్ భవనంలో ప్రధాన మంత్రిని కలిసింది. రాష్ట్రానికి అధిక నిధులు కేటాయిస్తూ రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తున్నందుకు మోదీకి ఎంపీల బృందం కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ఎంపీలను ప్రధానికి పరిచయం చేశారు. ఆ క్రమంలో విజయనగరం ఎంపీ అప్పలనాయుడును పరిచయం చేస్తుండగా మోదీ కల్పించుకుని కలిశెట్టి తనకు తెలుసని, కొత్త విషయాలు తెలుసుకోవడం, ఉత్సాహంగా పనిచేస్తూ సమాజానికి మంచి విషయాలు తెలియజేసేందుకు ప్రయత్నిస్తుంటారని అంటూ అప్పలనాయుడి భుజం తట్టి అభినందించారు.

• ఎడిటోరియల్

# ఓట్ల లెక్కలన్నీ అంకెల గారడీయేనా?

ఎన్నికల్లో అక్రమాలు మన ఘనతరమైన ప్రజాస్వామ్య సౌధంలో కొత్త కాదు. రిగ్గింగ్, దొంగ ఓట్ల నమోదు, బూత్ క్యాప్చరింగ్ వగైరా చిన్నెలన్నీ పాతబడిపోయాయి. మనం పాత సంప్రదాయాలకు నీళ్లొదిలేసినట్లే ఎన్నికల అక్రమార్కులు కూడా సంప్రదాయ ఎన్నికల అక్రమాలను వీడి ఈవీఎంల ట్యాంపరింగ్, ఓటర్ల జాబితాల్లో మతలబులు వంటి విధానాలను అనుసరిస్తున్నారు. ఈవీఎంల ట్యాంపరింగ్ ఆరోపణలు ఇప్పటివి కావు. ఈ వ్యవస్థ అందుబాటులోకి వచ్చినప్పటినుంచీ ఈవీఎంల పనితీరుపై అనుమానాలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. అయితే చిత్రంగా ఎన్నికల్లో ఓడిపోయిన పార్టీలే ఈవీఎంలను తప్పుపడుతున్నాయి. అదే పార్టీ మళ్లీ ఎన్నికల్లో గెలిస్తే.. గతంలో అవే ఈవీఎంలలో పోలైన ఓట్లతో గెలిచి నోరుమెదపని పార్టీ.. ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత మాత్రం ఈవీఎంలను తప్పుపడుతోంది. షరామామూలుగా ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వం కూడా ఈవీఎంల నికార్సయినవని, ఎవరూ ట్యాంపర్ చేయలేరని సర్టిఫికెట్ ఇస్తున్నాయి. ఈ ఖండన మండనలతో తమకేం సంబంధం లేనట్లు ఎన్నికల అక్రమాలు మాత్రం కొత్త పుంతలు తొక్కుతున్నాయి. అక్రమాలు ఎలా, ఎప్పుడు జరిగినా ఓట్ల లెక్కలు మాత్రం సరిపోయేలా చూసుకునేవారు. కానీ 2024 ఎన్నికల్లో మాత్రం ఆ పరామీటర్‌ను కూడా బేఖాతరు చేసినట్లు పలు స్వచ్ఛంద నిఘా సంస్థలు, తాజాగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వెలికితీసిన అంకెలు స్పష్టం చేస్తున్నాయి. అదేంటంటే.. గత ఎన్నికల్లో ప్రజలు వేసిన ఓట్ల సంఖ్యకు.. ఫలితాలు తేల్చేందుకు అధికారులు లెక్కించిన ఓట్ల సంఖ్యకు దేశవ్యాప్తంగా వందకుపైగా పార్లమెంటు నియోజకవర్గాల్లో పొంతనే కుదరలేదట! వాస్తవానికి ఈ ఆరోపణ కొత్తదేం కాదు. గత ఏడాది ఎన్నికల ఫలితాలు ప్రకటించిన కొన్ని నెలల వ్యవధిలేని ఏడీఆర్ వంటి సంస్థలు ఈ విషయాన్ని అంకెలతో సహా బయటపెట్టాయి. కానీ అప్పట్లో ఎన్నికల సంఘంతో సహా ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పుడు తాజాగా దేశ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఈ తేనెతుట్టెను కదిపారు. దాదాపు ఏడాది పాటు అనేక నియోజకవర్గాల్లో ఈ అంకెల గారడీపై పార్టీపరంగా విచారణ జరిపి అక్రమాల నిగ్గు తేల్చామని రాహుల్‌గాంధీ ప్రెస్‌మీట్ పెట్టి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల సంఘం ప్రకటించిన ఓట్ల లెక్కల్లోనే మతలబులను వివరించారు. దాని ప్రకారం చాలా నియోజకవర్గాలో పోలైన ఓట్ల కంటే లెక్కించిన ఓట్ల సంఖ్య ఎక్కువగా ఉంది. అదనంగా ఉన్న ఓట్లన్నింటినీ ఎన్డీయే పార్టీల ఖాతాలో వేసేసి.. ఆ కూటమే మెజారిటీ సీట్లు సాధించినట్లు ప్రకటించారని.. ఇది కేంద్ర ఎన్నికల సంఘం, బీజేపీ కలిసి ఆడిన నెంబర్ గేమ్ అని రాహుల్ ఆరోపించారు. విశేషం ఏమిటంటే.. గత ఎన్నికల్లో ఏపీలో ఓటమి పాలైన వైకాపా కూడా చాలా నెలల ముందే ఇవే ఆరోపణలు చేసింది. వీవీప్యాట్ల ఓట్లు లెక్కించి ఫలితాల సందర్భంగా లెక్కించిన ఓట్ల సంఖ్యతో సరిపోల్చాలని కోరుతూ ఒంగోలు వంటి కొన్ని నియోజకవర్గాల్లో ఓడిపోయిన వైకాపా నేతలు కోర్టులను ఆశ్రయించి, మళ్లీ లెక్కింపునకు అవసరమైన రుసుములు కూడా చెల్లించినా ఎన్నికల అధికారులు ఆ లెక్కల విషయంలోనూ మేనేజ్ చేసేశారన్న ఆరోపణలు వినిపించాయి. వైకాపా అధినేత జగన్ కూడా ఈవీఎంల పనితీరు, ఓట్ల లెక్కింపు వ్యవహారంపై గతంలో ఆరోపణలు చేసినా ఆ తర్వాత.. ఆ పార్టీగానీ, ఓడిపోయినా నేతలు గానీ ఆ వివాదాన్ని వదిలేశారు. ఇప్పుడు రాహుల్‌గాంధీ ఈ ఆరోపణల తీగ లాగడం ద్వారా డొంకంత కదిలించే ప్రయత్నం చేస్తున్నారు. రాహుల్‌గాంధీ ఇంత చేస్తున్నా.. వైకాపా, దాని అధ్యక్షుడు జగన్ ఇప్పటికైనా ఈ ఓట్ల అక్రమాలపై ఆయనతో కలవడానికి ముందుకు రావడంలేదు. కనీసం గతంలో వినిపించిన గొంతునైనా మళ్లీ విప్పడంలేదు. రాహుల్ తన ప్రెస్‌మీట్‌లో నేరుగా జగన్ పార్టీ గురించి ప్రస్తావించి ఓట్ల మాయ వల్లే ఆ పార్టీ ఓడిపోయిందన్నట్లు మాట్లాడినప్పుడు.. అది కూడా ఒక ప్రజాస్వామిక సమస్యపై గొంతెత్తుతున్నప్పుడు ఇంకా పాత విషయాలను మనసులోపెట్టుకుని కాంగ్రెస్‌తో అంటీముట్టనట్లు ఉండటం సబబు కాదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఏమైనా ఎన్నికల నిర్వహణ, ఈవీఎంలపై ఇంత తీవ్రస్థాయిలో ఆరోపణలు, అనుమానాలు వ్యక్తమవుతున్నప్పుడు వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ఆయా వ్యవస్థలదే. అన్‌ఫెయిర్ ఎలక్షన్స్ అంటేనే అన్‌ఫెయిర్ గవర్నమెంట్ అనీ.. అన్‌ఫెయిర్ గవర్నమెంట్ అంటే అన్ డెమొక్రాటిక్ అనీ.. ప్రజలు ఒక నిర్ణయానికి వచ్చేస్తే.. ఎన్నికలే పునాదిగా నిర్మించుకున్న మన ప్రజాస్వామ్య వ్యవస్థ పేకమేడలా మారిపోతుంది.

## విశ్వబ్రాహ్మణ సంఘ కార్యవర్గం ఎన్నిక

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



గుజరాతిపేట బ్రహ్మం గారి కోవెలలో జరిగిన విశ్వబ్రాహ్మణ సంఘము కార్యవర్గ సమావేశంలో స్థానిక గుజరాతి పేట విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులుగా న్యాయవాది నాదేళ్ల భార్గవ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా అలుగోలు కోటేశ్వరరావు, కోశాధికారిగా అలుగు గోపిలను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా గాడి గణపతి ఆచారి, బురగాపు లక్ష్మణరావు మాస్టారు, పొట్నూరు శ్రీనివాసరావు మాస్టారు వ్యవహరించారు

## వైభవంగా అసిరితల్లి ఉత్సవం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

శ్రీకాకుళం మండలం తమ్మినాయుడుపేటలో కొలువైన అసిరితల్లి సమేత లలితా చంద్రమౌళీశ్వర దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందరి సహకారంతో శ్రావణ పౌర్ణమి సారె మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త సాగి శ్రీనివాసరాజు చెప్పారు. గ్రామదేవతకు చల్లదనం చేయడంతోపాటు అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణతో జరిపిన ఊరేగింపులో గ్రామ ప్రజలు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.



## ఉచితం ప్రభుత్వానిది.. సొమ్ము ప్రజలది

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్ ప్రయాణం పథకం పేరు మాత్రమే ఉచితమని, వాస్తవానికి ప్రజల సొమ్ముతో నడుస్తోందని, ఈ పథకం వల్ల ఆర్టీసీకి భారీ ఆర్థిక భారం పడుతుందని వైకాపా జిల్లా మహిళా అధ్యక్షురాలు ఉలాల భారతి దివ్య విమర్శించారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బస్సుల నిర్వహణ, సిబ్బంది జీతాలు, ఇంధన ఖర్చులపై ప్రభుత్వం సరైన నిధులు కేటాయించకపోవడంతో సేవలు దెబ్బతింటున్నాయన్నారు. మహిళల కోసం నిజమైన సంక్షేమం అంటే నాణ్యమైన, సమయపాలితమైన రవాణా సేవలు అందించడమేనన్నారు. కానీ ఈ పథకం అమలు విధానం వల్ల బస్సులసంఖ్య తగ్గిపోవడం, టైంటేబుల్ లోపాలు, ప్రయాణీకులకు ఇబ్బందులు ఎక్కువవుతున్నాయన్నారు. ప్రజా సొమ్ము వృథా చేసే విధంగా కాకుండా, ఆర్థికపరంగా స్థిరమైన, నాణ్యమైన రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయడం ప్రభుత్వ బాధ్యతన్నారు. జిల్లా, రాష్ట్రవ్యాప్తంగా మద్యం విక్రయాలు పెరుగుతూ ఉండడం ఆందోళనకరమన్నారు. అధిక మద్యం వినియోగం వల్ల కుటుంబాలు దెబ్బతింటున్నాయని, మహిళలు, పిల్లలు మానసికంగా, ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. భర్తలు, కుటుంబపెద్దలు మద్యం బారిన పడటం వల్ల కుటుంబ వ్యవస్థ దెబ్బతింటుందన్నారు.

## ఏపీజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శాసపు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



జర్నలిస్ట్ సంఘాల్లో ఉంటూ నాలుగు దశాబ్దాలుగా పలు హోదాల్లో సేవలందిస్తున్న ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శాసపు జోగినాయుడు ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల ఫోరంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపికయ్యారు. మూడు దశాబ్దాలుగా శ్రీకాకుళంలో ఆకాశవాణి, దూరదర్శన్ న్యూస్ విభాగానికి ప్రతినిధిగా పనిచేస్తున్న జోగినాయుడు 1988 నుంచి 2007 వరకు పాలకొండ, విశాఖపట్నం ప్రాంతాల్లో ఈనాడు రిపోర్టర్‌గా పని చేశారు. పాత్రికేయుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహించారు. పాత్రికేయుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వాలతో రాజీ లేని పోరాటాలు సాగించే జోగి నాయుడుకు జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్ష పదవికి ఎంపిక కావడం పట్ల సిక్కోలు జిల్లా జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మాజీ సైనికుల భవనం ప్రారంభోత్సవం



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)


ఫరీద్ పేట గ్రామంలో మాజీ సైనికుల నూతన భవన ప్రారంభించినట్లు డిస్ట్రిక్ట్ ఎక్స్ సర్వీసుమెన్ ఫెడరేషన్ శ్రీకాకుళం అధ్యక్షులు పూర్ణచంద్రరావు కటకం సోమవారం మీడియాకి తెలిపారు. వివరాలలోకి వెళ్లగా ఫరీద్‌పేట ఎక్స్ సర్వీసుమెన్ యూనియన్ ప్రెసిడెంట్ సీపాన అప్పారావు, వైస్ ప్రెసిడెంట్ సువ్వారి రంగనాథం, సెక్రటరీ పైడి నారాయణ మూర్తి, జాయింట్ సెక్రటరీ పైడి వెంకట నారాయణ, కోశాధికారి పైడి రంగనాథం, చైర్మన్ పైడి రామారావు, వైస్ ఛైర్మన్ సనపల ఫల్గుణరావులు ఊరిలో ఉన్న ఒక 60మంది మాజీ సైనికులు, 50 మంది సైన్యంలో పని చేస్తున్న వారు కలిసి ఈ భవనాన్ని నిర్మించుకున్నారు. ఈ భవనంను ఎంపీపీ మొదలవలస చిరంజీవి ప్రారంభించగా డిస్ట్రిక్ట్ ఎక్స్ సర్వీసుమెన్‌ఫెడరేషన్ శ్రీకాకుళం చైర్మన్ పి.ఈశ్వరరావు విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ప్రారంభోత్సవ సందర్భంగా సీనియర్ మాజీ సైనికులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ఉపాధ్యక్షులు వి.సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పి.మురళీధరరావు, గౌరవాధ్యక్షులు తర్ర కృష్ణారావు, ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.రామక్రిష్ణ, కోశాధికారి ఎం.సింహాచలం, అధికార ప్రతినిధి కె.కన్నారావు, కార్యవర్గ సభ్యులు బి.రాంబాబు, డి.వాసుదేవరావు, జి.రామారావు, టి.నాగరాజులతో పాటు పలాస, సతివాడ, రాజాం ప్రాంతాల అధ్యక్షులు ఇల్ల మన్మధరావు, తాళ్ల పాపారావు, సురేష్, ఆమదాలవలస ఉపాధ్యక్షులు పైడి సూర్యారావులు పాల్గొన్నారు.

## శ్రీరామచంద్రమూర్తికి మాతృవియోగం

(సత్యంన్యూస్, బూర్జ)



శ్రీరామరక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకులు, తెలంగాణా 26 బిసి కులాల జేఏసీ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి శ్రీరామ చంద్రమూర్తి తల్లి అమ్మాయమ్మ (85) సోమవారం తమ స్వగ్రామం గుత్తావల్లిలో మృతి చెందారు. ఈమె గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు శ్రీరామ చంద్రమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు శ్రీరామచంద్రమూర్తి ఇంటికి చేరుకుని ఆయనను ఓదార్చారు. ఇదిలా ఉండగా శ్రీరామచంద్రమూర్తి ఇటు ఆంధ్రా, అటు తెలంగాణాలో కళింగ జాతి కోసం, 26 బీసీ కులాల ఔన్నత్యం కోసం కృషి చేస్తున్న విషయం తెలి సిందే. అదే విధంగా శ్రీముఖలింగంలో పురాతనంగా మరుగున పడ్డ బాలియాత్ర పునఃప్రారంభానికి తగిన విధంగా చేయూతనందించారు.




# ప్రైవేట్ సినిమాల దందాకు..
# ప్రజలకెందుకు అవస్థలు!

సినిమాలకు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డిని ఎవరో గానీ తప్పుదోవలో తీసుకుపోతున్నట్టుగా కనిపిస్తోంది. తన ధోరణి నుంచి యూటర్న్ తీసుకోవడం వెనుక ఎవరి ప్రభావం ఉందో గానీ మామూలు జనానికి మాత్రం నచ్చని పంథాకు మళ్లింది ప్రభుత్వ విధానం. ఇక్కడ బతుకుతూ, ఇక్కడి నుంచే ప్రేక్షకులను దోచుకుంటూ, ఇక్కడి సీఎం పేరు తెలియనట్టు బహిరంగంగా, ఆఫ్టరాల్ తెలియాల్సిన అవసరమే లేదన్నట్టు నటించిన ఓ బన్నీని అరెస్టు చేయడం గానీ, సుద్దపూసలా నటిస్తూ ప్రభుత్వ భూమిని కబ్జా చేసి కట్టిన ఎన్ కన్వెన్షన్ కూల్చివేయడం గానీ, ఈ సినిమా వాళ్ల ప్రభావం పడని ప్రజా ముఖ్యమంత్రిగా పేరొచ్చింది. అల్లు అర్జున్‌ను పరామర్శించడానికి మొత్తం టాలీవుడ్ తన ఇంటికి క్యూ కట్టడం ఒకరకంగా రేవంత్ రెడ్డిని ఆక్షేపించడం.. అది ఎందుకో మరిచిపోయినట్టున్నాడు సీఎం.

సినిమా కుటుంబానికి చెందిన చంద్రబాబుకు చేతకాకపోయినా పదేళ్ల సినిమాలను గుర్తించి, గద్దర్ అవార్డులు ఇచ్చి, సినిమా రంగానికి మరో పాజిటివ్ కోణాన్నీ చూపించాడు. సంధ్య థియేటర్ తొక్కిసలాట తరువాత నో బెనిఫిట్ షోస్, నో ప్రిరిలీజ్ ఫంక్షన్స్, నోమోర్ టికెట్ రేట్స్ హైక్, నో అడిషనల్ షోస్ అనే విధానం తీసుకున్నారు. జనం హర్షించారు.

కానీ ఏమైంది..? మళ్లీ అదే పాత పంథాకు వెళ్లిపోయింది ప్రభుత్వం. అన్నీ మళ్లీ ప్రవేశించాయి. అసలు టికెట్ల రేట్ల పెంపు అనేదే దుర్మార్గం.. దానికి సినిమా వాళ్లు చూపించే నిర్మాణ వ్యయాలు పెద్ద బోగస్ యవ్వారం. పైగా దోపిడీ కోసం బెనిఫిట్ షోస్, అదనపు షోస్.. ఇక ప్రిరిలీజ్ ఫంక్షన్లు దేనికి..? ఎవరిని ఉద్ధరించడానికి..?

అది పక్కా వ్యాపారం. తమ సినిమాలకు హైప్ క్రియేట్ చేయడం కోసం ఓటీటీ, శాటిలైట్, ఓవర్సీస్ రైట్స్ రేట్లను అడ్డగోలుగా పెంచుకోవడం కోసం ఉద్దేశించిన మార్కెటింగ్ టెక్నిక్. వాడు వీడిని పొగుడుతాడు, వీడు వాడిని పొగుడుతాడు. టీమ్ మొత్తం స్వకుచమర్దనం. దీనికి ఫ్యాన్స్ పేరిట హంగామా, హడావుడి, సొసైటీకి అదనపు నష్టం. ఈ ఖర్చులన్నీ మళ్లీ ప్రేక్షకుడే భరించాలి.

ఇప్పుడు చూడండి.. వార్–2 సినిమా వార్త.. యూసుఫ్‌గూడ బెటాలియన్ పోలీస్ లైన్స్‌లో ప్రిరిలీజ్ అట.. పలుచోట్ల వాహనాల డైవర్షన్ అట.. పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు అట.. ఏదో ప్రైవేటు సినిమా దందాకు భారీగా పోలీసుల మొహరింపు దేనికి..? ప్రజలకు ఈ మళ్లింపు అవస్థలు దేనికి..? అసలే అత్యంత భారీ వర్షాలు అని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. చినుకు కురిస్తే చాలు నగరం స్థంభించిపోతోంది. మరి ఎందుకీ పర్మిషన్..? ఎవరి సంపాదనకో ప్రభుత్వాలు ఎందుకు సాగిలబడాలి..?

హిందీ సినిమాలను ఎవడూ దేకడం లేదు. అందుకని సౌత్ మార్కెట్ కోసం జూనియర్ ఎన్టీయార్ కావాలి. పాన్ ఇండియా పేరు పెట్టాలి. చిత్రపరిశ్రమను ఏపీకి తరలిస్తాం అనే బెదిరింపులు ఏమైనా పనిచేస్తున్నాయా ప్రభుత్వం మీద.., నవ్వొచ్చే విషయం.

ఇదే ఇండస్ట్రీ జగన్‌ను ఎలా చూసిందో చూశాం, సినిమా కుటుంబాలు ఏపీకి చిరకాలం పాలించవు. మళ్లీ ఎవరో వస్తారు..? ఐనా అబ్రకదబ్ర అనగానే ఇండస్ట్రీ ఎటూ తరలిపోదు. పైగా హైదరాబాదులో ఉండటానికి అలవాటైనవాడు అస్సలు దీన్ని విడిచిపెట్టడు. అమరావతి వాతావరణం అక్కరకు రాదు. వైజాగులో సాధ్యం కాదు. హైదరాబాదే దిక్కు.

ముంబైలో మరాఠీ గోల, బెంగుళూరులో కన్నడ దాష్టికం, చెన్నైలో అరవ పెత్తనం.. అలాంటివేమీ లేకుండా అందరినీ అక్కున చేర్చుకునేది హైదరాబాద్ ఒక్కటే.. వేరే భాషలు, వేరే సంస్కృతులు జానేదేవ్.. మరెందుకు ప్రభుత్వం మళ్లీ మళ్లీ ఇలా సాగిలబడటం..?!

- ముచ్చట సౌజన్యంతో...

## ఆమె కోసమే జనం సినిమాలకు ఎగబడ్డ రోజులుండేవి!

శృంగార కావ్యాలలో రాసిన స్త్రీ సౌందర్యానికి, శరీర లావణ్యానికి సరైన కొలబద్దలా ఉండేది జ్యోతిలక్ష్మి. జ్యోతిలక్ష్మి ఆట, ఎల్లారీశ్వరి పాట, రాజబాబు కామెడీ ఒక జమానాలో తెలుగు సినిమాని ఊపేశాయి. అప్పట్లో హండ్రెడ్ డేస్ ఆడిన ప్రతి మూడు సినిమాల్లో రెండు వీళ్ల మూలానే ఆడాయంటే నమ్మరు. అంత పాపులారిటీ సంపాదించారు. పిల్లా? పిడుగా?', 'మొనగాడొస్తున్నాడు జాగ్రత్త!', 'గుండెలు తీసిన మొనగాడు' వంటి కొన్ని కౌబాయ్, అడ్వంచరస్ చిత్రాల్లో హీరోయిన్‌గా కూడా నటించింది. మొత్తం మీద ఇరవై చిత్రాల్లో హీరోయిన్‌గా నటించగా, తమిళంలోనే పది సినిమాలలో లీడ్ రోలు పోషించింది. 'మోసగాళ్లకు మోసగాడు' సినిమాలో వ్యాంప్ క్యారెక్టర్ వేసి హీరోయిన్ విజయనిర్మల కంటే ఎక్కువ మార్కులే కొట్టేసింది. 'మొనగాడొస్తున్నాడు జాగ్రత్త!' సినిమాకి ఎల్లారీశ్వరి సింగిల్ కార్డ్ గాయని. హీరో కృష్ణ సహా మరొకరికి పాటే లేదు! శాస్త్రీయ నృత్యంలో ఆరితేరిన జ్యోతిలక్ష్మి.."ఇదా లోకం?(1973)" సినిమాలో "గుడి ఎనక నా సామి గుర్రమెక్కి కూకున్నాడు" పాటలో అటు శాస్త్రీయాన్ని, ఇటు పక్కా మాస్ స్టెప్పుల్ని వేసి ప్రేక్షకుల్ని గిలిగింతలు పెట్టింది. ఎన్టీఆర్, ఏఎన్ఆర్, కృష్ణ, శోభన్‌బాబు.. ఇలా హీరోలు ఎవరైనా.. వాణిశ్రీ, కాంచన, మంజుల, భారతి వగైరా అందాల తారలు ఉన్నా జ్యోతి లక్ష్మి ఆట-పాట ఉండాల్సిందే! కేవలం జ్యోతిలక్ష్మి పాట కోసమే సినిమాలకు వెళ్లే జనం ఉండేవారట! బొబ్బిలి పులి(1983) నాటికే ఈమె రిటైరయ్యింది.

- మణిభూషణ్



# గౌరీశంకర్‌కు పురస్కారం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

హాస్యకథల పోటీలో శ్రీకాకుళానికి చెందిన గాయత్రీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ తెలుగు విభాగాధిపతి భమిడిపాటి గౌరీశంకర్ ఉత్తమ రచయితగా ఎన్నికయ్యారు. విశాఖకు చెందిన సంస్కృతి పత్రిక ఈ పోటీలు నిర్వహించింది. మాజీ ఎంపీ డీవీజీ శంకరరావు చేతుల మీదుగా ఆయన ఆ పురస్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో శిరేలా సన్యాసి రావు, రామకోటయ్య, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.



ఇటీవల మరణించిన మాజీ జెడ్పీటీసీ గొర్లె లక్ష్మణరావుకు వైకాపా నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఎం.ఏ.బేగ్, డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్, పూజారి మన్మధరావు, గుడ్ల దామోదర్ రావు, శివనారాయణ, బహదూర్ జానీ, పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సీతారామయ్యలు పాల్గొన్నారు. - సత్యంన్యూస్, శ్రీకాకుళం

# అందని ఎచ్చెర్ల పోస్టాఫీసు సేవలు

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

మండల కేంద్రమైన ఎచ్చెర్ల సబ్ పోస్టాఫీసులో వారం రోజులుగా సర్వర్ పని చేయక సేవలు అందడంలేదని ఖాతాదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒకసారి సర్వర్ పని చేయడం లేదని, మరోసారి పోస్ట్ మాస్టర్ సెలవుపై ఉన్నారని చెబుతున్నారని ఆరోపిస్తున్నారు. కారణం ఏదైనా వారం రోజులుగా ఎండ తీవ్రతను తట్టుకొని పోస్టాఫీస్‌కు వెళుతున్న వారికి నిరాశ తప్పడం లేదు. ఆర్డీలు, సుకన్య యోజన వంటి ప్రత్యేక పథకాలకు నెలనెలా డబ్బులు కడుతున్న వారు సకాలంలో వాటిని చెల్లించడం కుదరక ఫైన్ పడుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే తగు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.





కేవలం నెమళ్లు మాత్రమే తరచుగా కనిపించే వ్యవసాయ పొలాల వద్ద.. 1998 ప్రాంతంలో తన మేకలతోపాటు.. ఓ మూడు మచ్చలున్న జింకలు గడ్డి మేస్తుండగా గమనించాడు గురుస్వామి. గడ్డి తినేందుకు ఇతర పశు సంపదతో కలిసి నిత్యం జింకలు వస్తుండటం తమిళనాడుకు చెందిన గురుస్వామిని ఒకింత ఆశ్చర్యపర్చింది. నీరు, ఆహారం కోసం పొరుగున ఉన్న పశ్చిమ కనుమల్లోని మెట్టుపాళాయం అడవి నుంచి తన భూభాగంలోకి ప్రవేశిస్తున్నాయన్న విషయాన్ని గుర్తించాడు.

## జింకల రక్షణకు..

# పొలాన్నే వదులుకున్న గురుస్వామి!

మెట్టుపాళాయం అటవీప్రాంతం గత 25ఏళ్లుగా వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటోంది. అక్కడ గలగలా ఏడాది పొడవునా పారే కౌసికా నది ఇప్పుడు ఎడారైంది. చుట్టుపక్కల రైతులు నీటిపారుదల కోసం నీటిని అధికంగా వినియోగించడం వల్ల భూగర్భజలాలు కూడా క్షీణించాయి. ఆ ప్రభావం వన్యప్రాణులపై కూడా పడింది. అందులోనూ ముఖ్యంగా జింకలు ఆ దుర్భిక్షాన్నెదుర్కోలేక.. తమ పంట పొలాల వైపు వస్తున్న విషయాన్ని గురుస్వామి అర్థం చేసుకున్నాడు.

70 ఏళ్ల గురుస్వామికి తన పూర్వీకుల నుంచి సంక్రమించిన 60 ఎకరాల భూమి ఉంది. మొక్కజొన్న, పత్తితో పాటు.. కాలానుగుణ కూరగాయలు పండించేవాడు గురుస్వామి. 15 ఎకరాల్లో పూర్తిగా సేంద్రియ వ్యవసాయమే చేస్తుంటాడు. ఎందుకంటే ఈయన దగ్గర పశుసంపదెక్కువ. తన వద్దనున్న సుమారు వంద మేకలు, ఆవుల మేత కోసమే 45 ఎకరాల భూమిని కేటాయించాడు. ఆవు పేడను సేంద్రీయ ఎరువుల తయారీకి ఉపయోగిస్తుంటాడు.

అయితే జంతు ప్రేమ కల్గిన మానవత్వమున్న గురుస్వామి తన 60 ఎకరాల్లో కేవలం పదిహేను ఎకరాలు మాత్రమే తన వ్యవసాయం కోసం ఉంచుకుని.. మిగిలిన 54 ఎకరాలు జింకల సంరక్షణ, వాటి పెంపు కోసం అటవీశాఖకిచ్చేశాడు. జింకలు ఆకలికి అలమటించడం, దాహార్తితో నీటికోసం వెతకడం, కుక్కల దాడులకు గురవ్వడం, రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడటం, జింక మాంసం కోసం వచ్చే వేటగాళ్ల ఉచ్చుకు చిక్కడం వంటివన్నీ గురుస్వామిని కదిలించాయి. కొన్నేళ్లు గడిచేకొద్దీ అడవుల్లోంచి నీరు, ఆహారం లభించక పొలాల్లోకి వచ్చే జింకల జనాభా పెరిగింది. 2005 వరకూ కూడా పెద్దగా కనిపించని జింకలు.. పంటపొలాల్లోకి రావడంతో.. పంటలు పాడైపోతున్నాయని.. జింకలు తినేస్తున్నాయంటూ చుట్టుపక్కల రైతుల గగ్గోలు మొదలైంది. చాలామంది రైతుల నుంచి జిల్లా పాలనాధికారులు, అటవీశాఖాధికారులకు ఫిర్యాదులూ వెల్లువెత్తాయి. కొందరు రైతులైతే ఏకంగా జింకలను తరిమికొట్టేందుకు కుక్కలను పెంచుకోవడం మొదలుపెట్టారు. ఈ మొత్తం వ్యవహారం పత్రికలకు కూడా ఎక్కింది.

ఇక లాభం లేదనుకున్న గురుస్వామి జింకల సంరక్షణ కోసం చుట్టుపక్కల రైతుల్లో అవగాహన కల్పించేందుకు నడుంబిగించాడు. ఆ సమయంలో రైతులందరి నుంచీ అసమ్మతే ఎదుర్కోవాల్సి వచ్చింది. కానీ గురుస్వామి స్నేహితుడైన సి. బాలసుందరం మాత్రం తన కొబ్బరి తోటలో జింకలు సంచరిస్తే తనకేమీ ఇబ్బంది లేదని.. వాటికెలాంటి హానీ ఉండబోదనీ హామీ ఇచ్చాడు. 2008, 2010 ప్రాంతాల్లో జింకల కోసం వచ్చే వేటగాళ్ల బృందాల్ని స్నేహితుడు బాలసుందరంతో కలిసి గురుస్వామి అటవీశాఖాధికారులకు పట్టించాడు.

అప్పట్నుంచీ అటవీశాఖ అధికారులు కూడా గురుస్వామికి సహకరించడం.. తానిచ్చిన నలభైఐదు ఎకరాల స్థలంలోనే రెండు చెరువుల్లాంటి కొలన్లను తవ్వించి.. ప్రతీ వేసవిలోనూ వాటిని నీటితో నింపుతూ జింకల సంరక్షణ కోసం కృషి చేయడం ప్రారంభించారు. జింకలను రక్షించడంలో, వాటి ఆహార అవసరాలను అర్థం చేసుకోవడంలో ఫారెస్ డిపార్ట్‌మెంట్ గురుస్వామికి సంపూర్ణ సాయమందించింది. ప్రస్తుతం గురుస్వామి ఇచ్చిన నలభైఐదు ఎకరాల స్థలంలోని జింకల క్షేత్రం చుట్టూ.. వేటగాళ్లను నియంత్రించడానికీ, ఇతర చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు జరక్కుండా చూడ్డానికి ఫారెస్ట్ గార్డులు 24/7 అందుబాటులో ఉంటున్నారు. గురుస్వామి జింకల పట్ల కనబరుస్తున్న జాలి, దయ చూసిన కొన్ని స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ వేత్తలు కూడా స్పందించడం మొదలుపెట్టారు. గురుస్వామి కృషిని ప్రశంసించారు. ఇప్పుడు గురుస్వామి నలభైఐదు ఎకరాల పొలం పద్దెనిమిది వందల జింకలతో అలరించే ఓ అటవీక్షేత్రంగా మారింది.

భూమి కోసం, భుక్తి కోసమంటూ పాలివాళ్లు, అన్నదమ్ములే కొట్టుకునే రోజుల్లో ఓ వ్యక్తి తన నలభైఐదు ఎకరాల పంట భూమిని జింకల సంరక్షణ కోసం ఈరోజుల్లో దాతృత్వం ప్రకటించి పేరుకు తగ్గట్టే గురుస్వామి అనిపించుకున్నాడు అభినందనీయుడైన ఈ ఆదర్శప్రాయుడు!

- బాతాఖానీ.కామ్ సౌజన్యంతో..

# మహిళ వైద్యఖర్చులకు రూ.15 వేల సాయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

మెడ ఎముక విరిగిపోయి జెమ్స్‌లో చికిత్స పొందున్న పేద మహిళకు సిక్కోలు స్వచ్ఛంద సేవా సంస్థ తరఫున సోమవారం రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. శ్రీకాకుళం మండలం కిష్టప్పపేట గ్రామానికి చెందిన ముద్దాడ చిన్నమ్మడు అనే మహిళకు నెల క్రితం ప్రమాదవశాత్తు మెడ ఎముక విరిగిపోయింది. జెమ్స్ ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేశారు. భర్త విడిచిపెట్టడంతో డిగ్రీ చదువుతున్న కుమారుడితో కలిసి ప్రస్తుతం కన్నవారింట్లో ఉంటోంది. తండ్రి కూడా ఈ మధ్యే చనిపోవడంతో మందుల కొనుగోలు, వైద్యఖర్చులకు ఇబ్బందిపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న, సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి ముందుకొచ్చి రూ.15 వేల నగదు సాయం అందించింది. ఈ కార్యక్రమంలో బరాటం చంద్రశేఖర్, పరంకుశం జగదీష్, సింతు ఆటకేశం, పొడుగు చరణ్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రంథాలయానికి కంప్యూటర్ల వితరణ

(సత్యంన్యూస్, పాలకొండ)

స్థానిక శాఖా గ్రంథాలయానికి బెంగుళూరుకు చెందిన శివశ్రీ ఛారిటబుల్ ట్రస్ట్‌కు చెందిన శిక్షణ ఫౌండేషన్ సహకారంతో రెండు కంప్యూటర్లు, ఒక స్మార్ట్ టీవీ, ఒక స్మార్ట్ ఫోన్ అందజేశారు. వీటిని శిక్షణ ఫౌండేషన్‌కు చెం దిన మాస్టర్ ట్రైనర్ వల్లీదేవి చేతుల మీదుగా ఇన్‌ఛార్జి గ్రంథాలయాధికారి బబ్బూరు గణేష్‌బాబుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాఖా గ్రంథాలయాలకు డిజిటల్ యాక్సెస్ కల్పించే కార్యక్రమం కింద ఈ సహాయం అందిస్తున్నామన్నారు. త్వరలో ఉచిత ఇంటర్నెట్ సేవలు కల్పించి తర్వాత శిక్షణ పీడియా అనే వెబ్ అప్లికేషన్‌తో ఉమ్మడి జిల్లాలో డిజిటల్ లిటరసీని పెంచడానికి కృషి చేస్తామన్నారు.



# డిజిటల్ యుగజ్ఞానం!



మనం డిజిటల్ యుగంలో ఉన్నాం. రూల్స్ మారాయి. డిజిటల్ పూర్వ యుగం తెలితేటలు ఇక పనికి రావు. మన చర్యల పర్యవసానాలేంటో ఏమి చెయ్యాలో, ఏమి చేయకూడదో తెలుసుకోవడం ఎంతో అవసరం. కొన్ని నిజజీవిత ఉదారణలతో వివరిస్తాను. ఆమె వెండి తెర నటి. హుందా పాత్రలను పోషించింది. ఇప్పుడు వయసు యాభైకి సమీపించింది. నిన్నటికి భిన్నంగా ఆమె కురస దుస్తులతో తన ఫోటోలను పదే పదే పోస్ట్ చేస్తోంది. అవి స్పాన్సర్డ్ పోస్టులు కావడంతో మీ ఫ్రెండ్స్ లిస్ట్‌లో ఆమె లేకపోయినా అవి మీకు కనిపిస్తాయి.

**ఇంటర్నెట్‌లో చర్చలు..**

'ఎవరిష్టం వారిది. ఆమె దుస్తులను ప్రశ్నించడానికి మీరెవ్వరు? ఇది పురుషాహంకారం' అని కొందరు.

'లేదు ఇది సభ్యత.. సంస్కారం.. కాదు' అని మరికొందరు.

రెండు రకాల చర్చలను యూట్యూబ్‌లో చూసి బుర్ర గోక్కుంటూ గంటల కొద్దీ సమయాన్ని వృధా చేసుకొని గొట్టంగాళ్లకు.. రెవిన్యూ అందించేవారు కోకొల్లలు. అభిప్రాయం.. కౌంటర్ పాయింట్.. ఖండనలు.. వాటిపై తిరిగి ఖండనలు.. జనాల దగ్గర ఎంత టైం ఉందో మరి. వీటిని దాటి.. కాస్త ముందుకు వెళదాము.

ఇటీవల ఆమె పోస్ట్ చేసిన ఒక ఫోటో.. దానిపై కొన్ని వందల కామెంట్స్.. కుతూహలం కొద్దీ చూసేవారు కొందరు. జనాల ఆలోచన తీరు అర్థం చేసుకొనేందుకు చూసేవారు కొందరు. అందులో ప్రతిఒక్కటి ఆమెను తిడుతూ.. పచ్చి బూతులతో తిడుతూ కామెంట్స్. జనాల దగ్గర ఇన్ని బూతులు తిట్టించుకొంటూ ఈమె ఎందుకు ఇలా ఫోటోలు పెడుతోంది? ఆలోచన..

వెదకబోయిన తీగె కాలికి తగిలినట్టుగా వారం రోజుల్లోనే సమాధానం. ఒక స్టార్ హోటల్. అందులో ఒక దృశ్యం. దాన్ని చూడడంతో.. ఆమె సంపాదనకు ఇవన్నీ చేస్తోంది. ఫోటోలు పోస్ట్ చెయ్యడం మార్కెటింగ్ ప్రక్రియ అని అర్థం అయ్యింది.

ఆమె తెలుగు నటి అని నేను చెప్పలేదు. ఈ పోస్ట్‌లో ఆమె ఐడెంటిటీ చెప్పడం ముఖ్యం కాదు. ఎందుకంటే ఆమెలా వందల మంది. కేవలం ఉదారణ కోసం చెప్పాను. ఇలాంటి పరిస్థితుల్లో ఏమి చెయ్యాలో, ఏమి చెయ్యకూడదో తెలుసుకోవడం ముఖ్యం. రెండో ఉదాహరణ తర్వాత చెబుతాను.

ఇంకో నటి.. తన మైనారిటీ తీరని కూతురికి కోరిక తీర్చుకోవడానికి టాయ్స్ (పిల్లల ఆట బొమ్మలు కాదు.) కొనిస్తానని అందులో ఆమె చెప్పినట్టు ఉంది. ఆమె తన కూతురుతో దిగిన ఫోటోపై ఆమె మాటలు ఉన్నాయి. దాని కింద జనాలు బూతులు పోస్ట్ చేసారు.

ఇక్కడా అంతే.. కామెంట్స్ వల్ల పోస్ట్ మరింత మందికి వెళుతుంది. ఆమె పోస్ట్ చేసింది కంపెనీల కోసం. ఓటీటీ యుగంలో ఈ కంపెనీల సేల్స్ బాగా పెరిగింది. కోట్లలో టర్న్ ఓవర్. వీటి సేల్స్ మరింత పెంచుకోవడానికి ఉద్దేశించిన పోస్ట్ అది. పోస్ట్ రూపంలో వుండే ప్రకటన. డిజిటల్ తెలివితేటలు.

- అమర్నాథ్ వాసిరెడ్డి

**చేయకూడనివి :**

1. డిజిటల్ పోస్ట్‌లు మైరావణుడు. ఒక తల నరికితే ఇంకోటి వస్తుంది. మీరు తిడుతూ కామెంట్స్ పెడితే.. ఆ మాటకొస్తే ఎలాంటి కామెంట్స్ పెట్టినా ఆ పోస్ట్ మరింత మందికి చేరుతుంది. పోస్ట్ పెట్టేవారికి.. సోషల్ మీడియాకు ఇదే కావాలి. పోస్ట్ ఎంగేజ్మెంట్ అంటారు. ఎంత వివాదాస్పదం అయితే అంత రీచ్. అంత రెవిన్యూ. కాబట్టి ఇలాంటి వాటిపై కామెంట్స్ పోస్ట్ చెయ్యొద్దు.
2. 16 ఏళ్ల అమ్మాయిపై.. తల్లే ఆలా పోస్ట్ చెయ్యడం నేరం. ఈ విషయాన్ని సోషల్ మీడియాకు చెబితే.. సిగ్గు ఎగ్గూ లేకుండా ఇది మా కమ్యూనిటీ స్టాండర్డ్స్. కాబట్టి ఈ ఐడీని పోనీ కనీసం ఈ పోస్ట్‌ను బ్లాక్ చెయ్యము అని రిప్లై వచ్చింది. వారికి కావాల్సింది డబ్బు. జనాల బలహీనతలతో ఆడుకోవడం వారికి తెలుసు. కాబట్టి రిపోర్ట్ చేసి మీ సమయం వృధా చేసుకోవద్దు.
3. ఎవరైనా బతకలేక ఒళ్లమ్ముకొనేవారిపై పోలీస్‌లు చర్యలు తీసుకొంటారు. బహిరంగంగా.. అఫ్ కోర్స్.. చాలా సోఫిస్టికేటెడ్‌గా సోషల్ మీడియా వేదికగా బిజినెస్ చేసుకొంటున్న ఆమెపై పోలీస్‌లు దృష్టి సారించే అవకాశం లేదు.

**చేయాల్సినవి:**

ఒక చెత్త పోస్ట్ కనిపిస్తే వెంటనే దాని పోస్ట్ చేసిన ఐడీని బ్లాక్ చెయ్యండి. ఇలా లక్షల మంది బ్లాక్ చేస్తే వాడి రీచ్ తగ్గిపోతుంది. కుక్క కాటుకు చెప్పుదెబ్బ.
















### మూడు పార్టీలు.. నాలుగు ప్రభుత్వాలైనా

# దారి చూపింది ధర్మానే!



కాంట్రాక్టర్ ప్రసాద్‌తో మాట్లాడుతున్న అప్పటి ఆర్థిక మంత్రి బుగ్గన

(మొదటిపేజీ తరువాయి)

రూ.116 కోట్ల అంచనా వ్యయంతో డీపీఆర్ తయారుచేశారు. దాన్ని ఆమోదించిన ప్రభుత్వం 2012 బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతో రోడ్లు, భవనాల శాఖ ద్వారా టెండర్లకు పిలిచారు. కడపకు చెందిన బీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ టెండర్ దక్కించుకుంది కానీ, రాష్ట్ర విభజన కారణంగా పనులు పట్టాలెక్కలేదు.

2014 ఎన్నికల సమయంలో టీడీపీ కలెక్టరేట్‌ను ఎన్నికల హామీగా ప్రకటించింది. అందుకు అనుగుణంగా 2016 నవంబరు 12న అప్పటి సీఎం చంద్రబాబు రెండోసారి శంకుస్థాపన చేసి శిలాఫలకం వేసి డీపీఆర్‌లో కొన్ని మార్పులు చేసి 20 నెలల్లోనే పనులు పూర్తి చేసి, కొత్త భవనాలను అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. 2012లో కాంగ్రెస్ హయాంలో కేటాయించిన రూ.116.5 కోట్ల బడ్జెట్‌తోనే నిర్మించాలని నిర్ణయించారు. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చిన నాటికి 40 శాతం పనులే పూర్తయ్యాయి. రూ.116.5 కోట్ల అంచనా వ్యయం పెరిగింది. దీంతో రూ.156 కోట్లకు పెంచాలన్న ప్రతిపాదన వచ్చింది. కానీ అప్పటి ప్రభుత్వం అంగీకరించలేదు. కరోనా కారణంగా ఏడాదిన్నర పాటు పనులు పూర్తిగా నిలిచిపోయాయి. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం వల్ల కాంట్రాక్టర్ అర్థాంతరంగా పనులు నిలిపేశారు. 2023 జూన్ 27న శ్రీకాకుళం పర్యటనకు వచ్చిన అప్పటి సీఎం జగన్ ముందు నిధుల కొరతను ధర్మాన ప్రస్తావించారు. దీంతో కలెక్టరేట్ నిర్మాణానికి అవసరమైన రూ.69 కోట్లు మంజూరు చేస్తున్నట్టు జగన్ ప్రకటించారు. ఆ మేరకు రెండు దశల్లో కాంట్రాక్టర్‌కు రూ.50 కోట్లు చెల్లించారు. తుది దశ పనులు పూర్తిచేసి భవనాలకు సున్నం వేశారు. 2023 ఆగస్టు 4న శ్రీకాకుళం వచ్చిన అప్పటి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌ను కలెక్టరేట్ పనులు పరిశీలించాలని ధర్మాన కోరారు. ఆమేరకు వెళ్లిన మంత్రి మిగిలిన నిర్మాణాల పూర్తికి అవసరమైన నిధుల వివరాలను ఆర్థికశాఖకు పంపించాలని జిల్లా ఉన్నతాధికారులకు సూచించారు. దాని ఫలితంగా 2023 సెప్టెంబర్ 27న బిల్లు బకాయిల్లో రూ.7.33 కోట్లు చెల్లించారు. ఆతర్వాత మరో రూ.2.05 కోట్లు విడతల వారీగా చెల్లించారు. అన్ని ప్రభుత్వ శాఖల పాలన వ్యవహారాలు 2024 ఫిబ్రవరి నుంచి సమీకృత కలెక్టరేట్‌లో చేపట్టడానికి సన్నద్ధమవుతున్నట్టు 2023 అక్టోబర్ 5న కలెక్టర్ ప్రకటించారు. 2023 డిసెంబర్ నాటికి గ్రౌండ్‌ఫ్లోర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ఇంజినీర్లను ఆదేశించారు. 2024 సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడేనాటికే సమీకృత కలెక్టరేట్‌ను ఎట్టి పరిస్థితుల్లోనైనా ప్రారంభిస్తామని ప్రకటించినా నిధులు మంజూరులో జాప్యం కారణంగా పనులు ముందుకు సాగలేదు. బడ్జెట్‌లో కేటాయించిన మొత్తంలో మరో రూ.30 కోట్లు మంజూరు చేస్తే తప్ప పూర్తిస్థాయిలో రోడ్లు, ఇతర మౌలిక వసతులతో కొత్త భవనం అందుబాటులోకి తీసుకురాలేమని కాంట్రాక్టర్ ఉన్నతాధికారులకు వివరించారు. ఫర్నిచర్‌కే రూ.2 కోట్లు వెచ్చించాల్సి ఉంటుందని కాంట్రాక్టర్ ప్రతినిధులు వివరించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో నూతన భవనం గ్రౌండ్ ఫ్లోర్‌ను యుద్ధప్రాతిపదికన సిద్ధం చేసి ఎలక్షన్ కంట్రోల్ రూమ్‌గా రెండు నెలలు పాటు వినియోగించారు. ప్రస్తుతం భవనంలో పనులు సాగకపోయినా భవనానికి అభిముఖంగా 60 అడుగుల వెడల్పుతో ఒక రోడ్డును కొత్తగా నిర్మిస్తున్నారు.

కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు చెప్పినదాని ప్రకారం రూ.116.50 కోట్లతో చేపట్టిన కలెక్టరేట్ భవన నిర్మాణాలకు వైకాపా ప్రభుత్వం రూ.57.33 కోట్లు మాత్రమే చెల్లించింది. ఇప్పుడు కూటమి రూ.12 కోట్లు బిల్లులను క్లియర్ చేసింది. ఇంకో రూ.9 కోట్ల విలువైన పని పూర్తయివుంది. దీనికి ఇంకా చెల్లింపులు జరగాలి. ఇది కాకుండా మరో రూ.30 కోట్లు ఇస్తేగాని కాంట్రాక్టర్‌కు సొమ్ముల చెల్లింపు పూర్తికాదు. ఇదిలావుండగా, ఇటీవల ఉచిత గ్యాస్ సిలెండర్ల కార్యక్రమం ప్రారంభోత్సవానికి ఇచ్ఛాపురం నియోజకవర్గం ఈదుపురం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి కలెక్టరేట్ అంశం తీసుకువెళ్లడంతో రూ.12 కోట్లు చెల్లింపునకు మార్గం సుగమమైంది. ఇప్పుడు రూ.70 లక్షలు కలెక్టర్ నిధులతో 60 అడుగుల రోడ్డును భవనానికి అభిముఖంగా నిర్మిస్తున్నారు. వాహనాల పార్కింగ్ కోసం రోడ్డుకు ఆనుకొని సోలార్ ప్యానెలింగ్‌తో షెడ్లు నిర్మిస్తున్నారు. మూడు ప్రభుత్వాలు మారినా పూర్తిస్థాయి నిధులు మంజూరు కాలేదు. కానీ ఒక దార్శనికుడి ముందుచూపునకు తార్కాణంగా ఓ ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ జిల్లా ఏర్పడిన 75వ వసంతంలో అందుబాటులోకి వస్తుంది. ఏ ఆర్ అండ్ బి శాఖకు జీరో బడ్జెట్ అని ఎగతాళి చేశారో, అదే శాఖకు మంత్రిగా ధర్మాన ఉన్నప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణం పూర్తికాగా, స్థానిక ఏడురోడ్ల జంక్షన్ వద్ద పాతబ్రిడ్జిని కూడా కూలగొట్టి, ఇదే మంత్రిత్వ శాఖ నుంచి నిధులు తెచ్చారు. పొన్నాడ వంతెన కూడా ఇటువంటిదే. విచిత్రంగా ఈ మూడూ ధర్మాన ప్రసాదరావు తీసుకువస్తే, తెలుగుదేశం హయాంలో ప్రారంభోత్సవాలవుతున్నాయి.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి

**- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**(సత్యంన్యూస్, టెక్కలి)**

ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యునిగాను, సామాజిక సేవకుడి భావంతో మెరుగైన వైద్య సేవలను అందించి మన్ననలు పొందాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వైద్యులను కోరారు. పట్టణంలోని జిల్లా ఆసుపత్రిని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 9గంటలకు ఆసుపత్రికి చేరుకొని వైద్యులు, సిబ్బంది సమయపాలనను స్వయంగా పరిశీలించారు. హాజరు పట్టికలో సిబ్బంది హాజరును తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఓపి విభాగం, అత్యవసర విభాగం, జనరల్ వార్డ్, ఎముకల విభాగంతో పాటు అన్ని వార్డులను స్వయంగా పరిశీలించి రోగులతో మాటాడారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం వైద్యులు, స్టాఫ్ నర్సులు, సిబ్బందితో ఆసుపత్రిలోని సమీవేశ మందిరంలో సమీక్షించారు. ఆసుపత్రిలోని రోగులకు ఇబ్బందులు లేకుండా ఫ్యాన్లు, లైట్లు, జనరేటర్ వినియోగంలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ఇంకా ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరిస్తానని మంత్రి తెలిపారు. మెరుగైన వైద్యంతో పాటు ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రతినిత్యం పర్యవేక్షించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ సూర్యారావును ఆదేశించారు. రోగుల పడక బెడ్‌షీట్లు, మరుగుదొడ్లు, ఆసుపత్రి నిర్వహణ తదితర అంశాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి సూచించారు. స్టాఫ్‌నర్స్‌ల కొరత ఉందన్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకురాగా, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నత అధికారులతో మాట్లాడి స్టాఫ్‌నర్సుల నియామకానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఎస్పీతో ఫోన్లో మాట్లాడి ఆసుపత్రి వద్ద నిత్యం భద్రత కల్పించే విధంగా ఔట్‌పోస్ట్‌ను ఏర్పాటు చేయాలని అన్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో బయోమెడికల్ వ్యర్థరహిత ప్లాంట్, మార్చురీ భవన నిర్మాణాలను వచ్చే నెల 15న వినియోగానికి సిద్ధం చేయాలని ఏపీఎంఐడిసి ఇంజనీరింగ్ అధికారి వెంకటేష్‌ను ఆదేశించారు. ఆసుపత్రి ప్రాంతంలోని స్థలాన్ని సుందరంగా చదును చేసే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీఎంఐడీసీ ఇంజనీరింగ్ అధికారి సత్యప్రభాకర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ లక్ష్మణరావు, డాక్టర్ మహారాజ్, స్టాఫ్‌నర్సులు, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.



### అనుమతులు లేని నిర్మాణాలపై

# దృష్టి సారించండి

**- పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదు**

**- ప్రభుత్వ భవనాల్లో దుకాణదారులు సకాలంలో అద్దె చెల్లించేలా చర్యలు**

**- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**(సత్యంన్యూస్, టెక్కలి)**

టెక్కలి కేంద్రంలో అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణం చేపట్టిన యజమానులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. సోమవారం టెక్కలి పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్కలి కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని, ప్రధానంగా పారిశుధ్య నిర్వహణలో ఎక్కడా రాజీ పడకూడదని ఆదేశించారు. విద్యుత్ సౌకర్యంలో అంతరాయం లేకుండా చూడాలని, అన్ని వీధుల్లో వీధిదీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భవనాల్లో దుకాణాలు నడుపుతున్న యజమానులు సకాలంలో అద్దె చెల్లించే విధంగా చూడాలని, చెల్లించని వారిపై దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. ప్రతిఒక్కరూ ఇంటిపన్ను చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని పునరుద్ఘాటించారు. అర్హత ఉన్నవారు టెక్కలి ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, ఇందుకు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో ఆర్డీవో కృష్ణమూర్తి, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు



# 12న పద్మావతిలో జాబ్‌మేళా

**(సత్యంన్యూస్, నరసన్నపేట)**

ఈ నెల 12న స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల డైరెక్టర్ సిహెచ్ దుర్గాప్రసాద్ తెలియజేసారు. సుమారు 15 కంపెనీలు ఈ జాబ్‌మేళాలో పాల్గొంటాయని, యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.



గత కొంతకాలంగా ఆమదాలవలసలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానం కార్యక్రమం 559వ రోజు కూడా కొనసాగింది. అందులో భాగంగా ఆమదాలవలసలో పాలిశెట్టి దుర్గేష్ పుట్టినరోజును పురస్కరించుకుని కుటుంబ సభ్యులందరి సహకారంతో 35 మందికి అన్నదానం చేయడంతోపాటు స్వీట్లు, మజ్జిగ బాటిల్స్ పంపిణీ చేశారు.

**- సత్యంన్యూస్, ఆమదాలవలస**

# శివారు ప్రాంతాలకు నీరందించాలి

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

వంశధార ఎడమకాలువ ఆయుకట్టు పరిధిలోని పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని 22వేల ఎకరాలకు నీరందించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌ను పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎడమకాలువ శివారు ఆయుకట్టుకు నీరందకపోవడానికి నరసన్నపేటకు చెందినవారే కారణమని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నరసన్నపేట ప్రాంతంలో కాలువపై షట్టర్లు ఎత్తి నీరు దిగువకు తరలించుకుపోతున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. శివారు ప్రాంతానికి నీరు వచ్చే లోపలే ఎగువ ప్రాంతాల్లోని నరసన్నపేటలో కొందరు నీటిని అడ్డుకొని తరలిస్తున్నారని ఎమ్మెల్యే శిరీష కలెక్టర్‌కు వివరించారు. దీనిపై స్థానిక నాయకులతో మాట్లాడి నీటిని తరలించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. జూలైలోనే దమ్ములు పూర్తి అయ్యా యని వర్షాలు లేక నాట్లు ఎండిపోతున్నాయన్నారు. వంశధార ఎడమ కాలువ నుంచి నీరు వస్తే తప్ప పంటలు పండే అవకాశం లేదని కలెక్టర్‌కు విన్నవించారు. అధికారులకు పదేపదే కలిసి విన్నవిస్తున్నా స్పందించడం లేదని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో టీడీపీ సీనియర్ నాయకులు వజ్జ బాబురావు, పీరుకట్ల విఠల్, విజయ్, పలువురు రైతులు ఉన్నారు.



# 14న జెడ్పీ స్థాయి సంఘాల సమావేశాలు

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

జిల్లా ప్రజా పరిషత్ అధ్యక్షుల ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన ఏడు స్థాయి సంఘాల సమావేశాలు జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జరుగనున్నాయని సిఇఒ ఎల్ఎన్వి శ్రీధర్ రాజా ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఆరవ స్థాయి సంఘం, 11.30కు మూడవ, 12.30కు ఐదవస్థాయి సంఘాల సమావేశాలు జరుగుతాయన్నారు. అదేవిదంగా మధ్యాహ్నం 02.00 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు 2, 4, 1, 7వ స్థాయి సంఘాల సమావేశాలు జరుగుతాయన్నారు. సభ్యులు, సంబంధిత అధికారులు సమయానికి హాజరు కావాలని ఆ ప్రకటనలో కోరారు.

# కన్నెధారలో వరద పాయసం పూజలు

**(సత్యం న్యూస్, కొత్తూరు)**

గత కొన్నాళ్లుగా వర్షాల జాడ లేక వ్యవసాయ పనులు మందగించాయి. దాంతో కొత్తూరు చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరూ కలిసి కన్నెధార కొండల్లో వర్షాలు కురిపించాలని దేవుడిని కోరుతూ బండపై పాయసం పోసి.. మేక, కోడి, చేపను బలి ఇచ్చి పావురాన్ని విడిచి పెట్టారు. ఆ పావురం ఎటువైపు ఎగిరితే అటువైపు నుంచి వర్షం వస్తుందని పురాతన కాలం నుంచి ఒక నమ్మకం ఉంది. ఆ విశ్వాసంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



# పెద్దమార్కెట్‌లో రక్తదాన శిబిరం



రక్తదాతల సహకారం మరువలేనిదని శ్రీకాకుళం మార్కెట్ మర్చంట్ యూత్ వెల్ఫేర్, రీడిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోరాడ హరగోపాల్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించామని ఆయన తెలిపారు. నగరంలో అన్ని బ్లడ్ బ్యాంకులు పాల్గొన్న ఈ శిబిరంలో సంఘానికి చెందిన 351 మంది రక్తదానం చేశారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ మర్చంట్ యూత్‌వెల్ఫేర్, రీడిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఐతమ్‌లో పుస్తకావిష్కరణ

**(సత్యంన్యూస్, టెక్కలి)**

టెక్కలి సమీపంలోని ఐతం కళాశాలకు చెందిన కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు డాక్టర్ ఎస్.విష్ణుమూర్తి, డాక్టర్ వై.రమేష్, టి .చలపతి రావు, ఎమ్.రత్నమోహితలు రచించిన 'ప్రిన్సిపల్ ఆఫ్ ప్రొగ్రామింగ్ ఇన్ సి విత్ డేటా స్ట్రక్చర్స్' అనే పుస్తకాన్ని సోమవారం ఐతం డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరావు ఆవిష్కరించారు. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు, ప్లేస్‌మెంట్ శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులకు ఈ పుస్తకం బాగా ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.ఎస్ శ్రీనివాసరావు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.




# గణపతి నవరాత్రుల ఉత్సవ నిర్వహణకు ముహూర్తపురాట



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

వినాయక నవరాత్రులను హారికా కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో ప్రతియేడు మాదిరిగానే ఈ ఏడాది కూడా ఇలిసిపురం రైతుబజారు జంక్షన్‌లో నిర్వహించడానికి సన్నాహాలు మొదలయ్యాయి. హారికా ప్రసాద్ దంపతులు ముహూర్తపురాట వేసి ఏర్పాట్లకు అంకురార్పాణ చేశారు. అనంతరం హారికా ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఏడాది కొత్త విశేషాలు జోడించి 11 రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రత్యేక పూజలతోపాటు ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఇలిసిపురం మెగా యూత్ ప్రతినిధులు అప్పి, వాసు, చక్రవర్తి, సుకుమార్, భరత్, శ్రీధర్, విఘ్నేష్, కార్తీక్‌లతో పాటు హర్షవల్లి లయన్స్ క్లబ్ డీసీ కరణం శోభారాణి పాల్గొన్నారు.

# నాగవళి వరదగట్టు కబ్జాపై ఫిర్యాదు

**- స్వయంగా పరిశీలిస్తానని కలెక్టర్ హామీ**

**(సత్యంన్యూస్,శ్రీకాకుళం)**

శ్రీకాకుళం మండలం బలగ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్-1లోని సబ్‌డివిజన్లు 1 నుంచి 5 వరకు ఉన్న సర్వే నెంబర్లులో కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని ఆదివారం పేటకు చెందిన బోనెల చిరంజీవి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిసి కబ్జాలపై చిరంజీవి ఫిర్యాదు చేశారు. ఆదివారంపేట దాటిన తర్వాత శ్రీకాకుళం-అమదాలవలన ప్రధాన రోడ్డుకు ఆనించి ఉన్న సర్వే నెంబర్ 1లోని సబ్‌డివిజన్లు 1 నుంచి 5 వరకు సుమారు 1.80 ఎకరాల నాగావళి వరదగట్టు (ప్రభుత్వ భూమి)కి కంచె వేసి కబ్జా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కబ్జా చేసిన భూమిని ప్లాట్లుగా విభజించి విక్రయించే ప్రయత్నాలు చేస్తున్నారని వివరించారు. శ్రీకాకుళం-అమదాలవలన రోడ్డు విస్తరణ సందర్భంగా రోడ్డుకు ఆనించి ఉన్న నాగావళి వరదగట్టు కోలతలు వేసి ప్రభుత్వ భూమిగా రెవెన్యూ అధికారులు నిర్ధారించారని తెలిపారు. 2023లో ఈభూమిని జిరాయితీ భూమిగా చూపించి స్థానికంగా కొందరు రాజకీయ నాయకులు పొజిషన్ ధ్రువీకరణపత్రం కోసం చేసిన ప్రయత్నాలను అప్పటి కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లాఠకర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆడ్డుకున్నారని తెలిపారు. రెవెన్యూ రికార్డులు మేరకు భూ స్వభావం ప్రభుత్వ భూమిగా గుర్తించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారన్నారు. మూడుసార్లు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను రాత్రివేళలో తొలగించి కిరాయి మూకలతో స్థానికులను బెదిరించి కంచె వేశారన్నారు. రాజకీయ నాయకులతో ఉన్నతాధికారులపై కబ్జాదారులు వత్తిడి చేయించినా అప్పటి కలెక్టర్ లాఠకర్ సున్నితంగా తిరస్కరించారని ఫిర్యాదులో పొందుపరిచారు. కబ్జాచేసిన నాగావళి వరదగట్టు (ప్రభుత్వ భూమి)లో నిర్మాణాలు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువెల్లారు. కబ్జాచేసిన భూమికి పొజిషన్ ధ్రువీకరణ కోసం రెవెన్యూ అధికారులు చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు.

సదరు కబ్జా చేసిన భూమి పూర్వం కోనేరుగా ఉండేది. గ్రామ అవసరాలకు, మూగ జీవాల కోసం కోనేరును వినియోగించేవారన్నారు. నదిలో వచ్చే భారీ వరదలకు బలగ, ఆదివారం పేట కొట్టుకుపోకుండా, నగరంలోకి నీరు రాకుండా రక్షణ కోసం ఐదు దశాబ్దాల క్రితం వరద గట్టును ఏర్పాటు చేశారన్నారు. కోనేరు ను ఆనించి దీన్ని నిర్మాణం చేశారు. కబ్జా దారులు వరదగట్టును తవ్వి కోనేరును పూడ్చి సుమారు 1.80 ఎకరాల ఆక్రమించి వారసత్వంగా సంక్రమించినట్టు నకిలీ పత్రాలు సృష్టించి ఆక్రమించి ప్లాట్లుగా మార్చేస్తున్నారని కలెక్టర్‌కు వివరించారు. దీనిపై తక్షణం స్పందించి నాగావళి వరద గట్టు ఆక్రమణలపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.